మద్యం ముసుగులో..

ఛిద్రమవుతున్న యువత, కూలీల బతుకులు

- పాలేరులో బెల్ట్‌షాపులపై కొరవడిన నిఘా
- విచ్చలవిడిగా సిండికేట్ అమ్మకాలు
- వైన్‌షాపుల్లో లేని బ్రాండ్లు బెల్ట్ దుకాణాల్లో దర్శనం
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు



ఓ మద్యం దుకాణం ఎదుట బారులుదీరిన మద్యం ప్రియులు

పల్లెల్లో విస్తృతంగా పెరిగిన బెల్ట్ దుకాణాలపై నిఘా కరువైంది. వాటిని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్, పోలీస్ శాఖలు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అడ్డగోలుగా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. గ్రామాల్లో గల్లీగల్లీకో బెల్ట్ షాపులు ఉండడంతో మద్యం ప్రియులు అర్ధరాత్రి వరకు మద్యం సేవిస్తున్నారు. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. అయినా ఎక్సైజ్ శాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.

– ఖమ్మంరూరల్

పేరుకే కిరాణం.. అమ్మేది మద్యం..

నియోజకవర్గంలోని పలు కిరాణాదుకాణాలు పేరుకు బోర్డు పెట్టుకొని నడుస్తున్నాయి. కానీ లోపల మాత్రం మద్యం వ్యాపారం జోరుగా నడుస్తోంది. ఈనేపథ్యాన మద్యం సేవించి ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ నానా రభస చేస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

అర్ధరాత్రి వరకు దుకాణాలు..

గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు అడ్డూ, అదుపూ లేకుండా తెరిచి ఉంచుతున్నారు. దీంతో వయస్సుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిసలవుతున్నారు. కొందరు పొద్దస్తమానం కూలీకి పోయిన డబ్బులతో మద్యం సేవిస్తుండడంతో పలు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

ఘర్షణలకు కేరాఫ్ పల్లెలు..

ఇదిలా ఉండగా గతంలో ఎంతో ప్రశాంతంగా ఉండే పల్లెలు ఇప్పుడు మద్యం అమ్మకాలతో ఘర్షణలకు నిలయాలుగా మారుతున్నాయి. రోజంతా కష్టపడి సాయంత్రం ఇంటికొచ్చాక ఇరుగుపొరుగు వారితో కబుర్లు చెబుతూ కాలం గడిపేవారు. కాని ఇప్పుడు మద్యం మహమ్మారి పుణ్యమాని ఇరుగుపొరుగు, బంధువుల మధ్య ఏ చిన్నపాటి ఘర్షణ జరిగినా దాన్ని పెద్దది చేసుకొని బద్ధశత్రువులవుతున్నారు.

లోపించిన శాంతిభద్రతలు..

మద్యంతో ఘర్షణలు పడటంతో గ్రామాల్లో శాంతిభద్రతలు లోపించి రోజురోజుకు కక్షలు కార్పణ్యాలు పెరిగిపోతున్నాయి. దీంతో ఈ ఘర్షణలను నివారించడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. పోలీస్‌స్టేషన్‌లలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో నిత్యం జరిగే ఘర్షణలను నివారించడం కోసం పోలీసులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. అయితే బెల్ట్ దుకాణాదారులకు ఆయా గ్రామాల్లో చోటామోటా నాయకులు, ప్రజాప్రతినిధుల అండదండలుండడంతో బెల్ట్‌దుకాణాదారులు రెచ్చిపోయి మరీ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. కాగా, తిరుమలాయపాలెం మండలం బీరోలులోని కొన్ని బెల్ట్ దుకాణాల్లో కల్తీ మద్యం అమ్మకాలు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి కల్తీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

తనిఖీలు చేస్తున్నాం..

అందిన ఫిర్యాదులతో బెల్ట్‌షాప్‌లపై తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఎవరైనా ఎక్సైజ్ నిబంధనలను అతిక్రమించితే వారిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. గత రెండేళ్లలో 84 మందిపై 93 కేసులు నమోదు చేశాం. బెల్ట్‌షాప్‌లపై దాడులు కొనసాగుతూనే ఉంటాయి.

– ఆర్.రాజిరెడ్డి, ఎక్సైజ్ సీఐ

చట్టానికి ఎవరూ అతీతులు కాదు..

గ్రామాల్లో ఘర్షణల నివారణకు పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటోంది. చట్టానికి ఎవరూ అతీతులు కాదు. బెల్ట్‌షాప్‌లను అరికట్టాల్సిన బాధ్యత ఎక్సైజ్‌శాఖది. అయితే ఎక్కడ గొడవలు జరిగినా తక్షణమే అక్కడకు వెళ్లి సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– బస్వారెడ్డి, రూరల్ ఏసీపీ

దరఖాస్తులు.. భద్రమేనా?

- మూడో రోజు భారీగా దాఖలు
- కార్యాలయాల్లో ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్న దరఖాస్తులు



ఖమ్మంఅర్బన్ తహసీల్‌లో కుప్పగా పోసిన దరఖాస్తులు

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: సొంత జాగా ఉండి ఇళ్లులేని నిరుపేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చింది. ఈపథకం కింద ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఇందుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడంతోచివరిరోజు (గురువారం) కావడంతో దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో వచ్చి పడ్డాయి. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు బాక్సులు, రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఒక బాక్స్ ఏర్పాటు చేయగా.. పూర్తి చేసిన దరఖాస్తులను లబ్ధిదారులు ఆ బాక్స్‌లో వేస్తున్నారు. ఆతర్వాత ఏ రోజుకారోజు వచ్చిన దరఖాస్తులను తీసి కట్టలు కడుతున్నారు.

నేలపైనే దరఖాస్తులు..

దరఖాస్తుదారులకు ఎలాంటి రసీదు లేకపోవడంతో దాఖలు చేసిన దరఖాస్తులకు ఎంత మేర భద్రత ఉంటుందోనని లబ్ధిదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాక్సుల నుంచి తీసి కట్టలు కట్టే సమయాన ఏ ఒక్కటి మిస్ అయినా ఎవరు బాధ్యులు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. బాక్సులు నిండిపోవడంతో రెవెన్యూ ఉద్యోగులు దరఖాస్తులను కార్యాలయంలోని ఎన్నికల విభాగం గదిలో గచ్చుపైనే కుప్పపోయడాన్ని చూసిన వారు మన దరఖాస్తులు భద్రమేనా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఖమ్మం అర్బన్ తహసీల్‌లో మొదటి రోజు 200, రెండో రోజు 950పైగా దాఖలు కాగా రఘునాథపాలెం తహసీల్‌లో మొదటి రోజు 400పైగా, రెండో రోజు 500పైగా దాఖలు కాగా రెండింటి కార్యాలయాల్లో చివరి రోజు దరఖాస్తు దారులు పోటెత్తారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' అందివ్వాలి..

ఖమ్మంరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పథకం కోసం దరఖాస్తు చేసుకునే వారితో మాట్లాడిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత తొమ్మిదేళ్లుగా ఏదో ఒక పథకం తీసుకొచ్చి జనాలను ఊరిస్తూ గ్రామానికి ఒకటో రెండో ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇచ్చిన గడువు లోగా రావడం వీలుపడని నేపథ్యాన మరికొన్ని రోజులు గడువు పొడిగించాలని తెలిపారు. ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలకు బదులు రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

మంత్రి పువ్వాడను కలిసిన జిల్లా సంక్షేమశాఖ అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి టి.సుమ గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆమె మొక్కను బహూకరించారు.

తహసీల్దార్‌ను వెంటనే నియమించాలి

నేలకొండపల్లి: స్థానిక తహసీల్దార్‌ను వెంటనే నియమించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 2వ తేదీన ఇక్కడ పని చేసిన తహసీల్దార్ దారా ప్రసాద్ బదిలీ కావడంతో నేటి వరకు తహసీల్దార్‌ను నియమించలేదన్నారు. గృహలక్ష్మి పథకానికి గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

కార్ల అద్దాలకు ఫిల్మ్ తొలగించాలి



కారు అద్దం ఫిల్మ్ తీయిస్తున్న ఏసీపీ

ఖమ్మంక్రైం: కార్ల అద్దాలకు ఉన్న టింటెడ్ గ్లాస్(సన్ ఫిల్మ్) తొలగించాలని, లేనిపక్షంలో జరిమానా తప్పదని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పలు కార్ల సన్ ఫిల్మ్ తీయించారు. వాహనాల అద్దాలకు నల్లటి ఫిల్మ్ అంటించడాన్ని సుప్రీంకోర్టు నిషేధించిందని ఈసందర్భంగా ఏసీపీ తెలిపారు. ఈ మేరకు వాహనాదారులు తీయించకపోతే జరిమానా విధిస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ఖమ్మం సహకారనగర్: మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చేకూరి రవికుమార్ అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో జరిగిన మేరా మాటి మేరా దేశ్‌లో భాగంగా మొక్కలునాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పేరెల్లి కోటి, మహిళా విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ గాదె రమ, అధ్యాపకులు పులి మధు, పాముల శ్రీనివాస్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా గురువారం మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు గ్రామాల్లో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, శ్రీ సరస్వతి విద్యాలయం ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ క్యాంపెనింగ్ నిర్వహించి ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి, లక్ష్మీసుజాత, సతీష్‌రాజ్, వెంకోబ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎంను గెలిపించాలి

నేలకొండపల్లి: పాలేరు బరిలో నిలవనున్న సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మందడపు మురళీకృష్ణ కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కూచుపూడి శ్రీదేవి, భాగ్యలక్ష్మి, వెంకటమ్మ, కొలికపొంగు వెంకన్న, నరసమ్మ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీది కపట ప్రేమ

ఖమ్మం వైరారోడ్: ఐఎన్‌టీయూసీ నాయకులు ఆటో కార్మికులపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని బీఆర్‌టీయూ అనుబంధ ఆటో యూనియన్ నాయకులు గూడూరు ఉమామహేశ్వరరావు, కృష్ణ దుర్గాప్రసాద్ ఆరోపించారు. గురువారం వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పాల్వంచ కృష్ణ ఇటీవల ఒక్కొక్కరి నుంచి రూ.100 వసూలు చేసింది కేవలం ఆటో కార్మికుల సంక్షేమం కోసమేనని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి, భోళాశంకర్
వినోద	జైలర్
సాయిరాం	భోళాశంకర్
ఆదిత్య	భోళాశంకర్, బ్రో
శ్రీనివాస	భోళాశంకర్

- ఖమ్మంగాంధీచౌక్

ఎన్నికల కోసమే పథకాలు..



సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

నేలకొండపల్లి: ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం కేసీఆర్‌కు పథకాలు గుర్తుకొస్తున్నాయని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మంగాపురంతండాలో పల్లెనిద్రలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ నాలుగేళ్లలో చేయలేని అభివృద్ధి.. మిగిలిన మూడు నెలలో ఎలా చేస్తారని, గృహలక్ష్మి పథకం పేరుతో ప్రజలను మరోమారు మోసం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న దేవాలయ భూములపై పూర్తి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నేలకొండపల్లిలో కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఓ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన వ్యక్తులకు పార్టీకి సంబంధం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, సర్పంచ్ రాయపూడి నవీన్, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, చిన్న నాయక్, రాధాకృష్ణమూర్తి, జెర్రిపోతుల సత్యనారాయణ, రేగూరి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిర కమిటీ ఆధ్వర్యాన అన్నదానం



అన్నదానం చేస్తున్న డీసీసీబీ చైర్మన్, మేయర్ తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 14వ డివిజన్ మధురానగర్‌లోని సాయినాథ మందిరం కమిటీ ఆధ్వర్యాన గురువారం అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రమంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ నీరజ ప్రారంభించి మాట్లాడారు. ఇంకా సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావుతో పాటు చిరుమామిళ్ల రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం తుళ్లూరి నిర్మలకుమారి, బొర్రా సదాలక్ష్మి తల్లి ములుపురి సావిత్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా సుమారు 500 మంది బాధితులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్తెలు నిర్మలకుమారి, సావిత్రి, సదాలక్ష్మి, కుమారుడు బొర్రా మురళి, ఆస్పత్రి సిబ్బంది గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ



రాగిజావను పంపిణీ చేస్తున్న సురేష్

నేలకొండపల్లి: మండలంలోని బుద్ధారం పాఠశాలలో గురువారం ప్రభుత్వం అందించిన రాగి జావను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు ఇటిక్యాల సురేష్ మాట్లాడుతూ.. రక్తహీనత, పోషకాహార లోపంతో బాధపడుతున్న వారికి ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఆనంద్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై కేసు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంకు చెందిన ఆటోడ్రైవర్ యలగొండ రమేష్(40) కనిపించకుండా పోవడంతో ఆయన భార్య బూబమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన ఆటో తీసుకుని బయటకు వెళ్లగా తిరిగి రాలేదు. ఎక్కడ ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో ఆమె ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.

పేరుకే అప్‌గ్రేడ్ ఆస్పత్రి..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను గురువారం పీఓడబ్ల్యూ బృందం సందర్శించింది. ఈమేరకు ఆస్పత్రిలోని సమస్యలను అడిగి తెలుసుకున్నాక వైద్యాధికారులతో మాట్లాడారు. అనంతరం విలేకర్ల సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఝాన్సీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులపై ఆరోగ్య శాఖ మంత్రి నీతులు వల్లిస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఆస్పత్రిని సందర్శించాలని సూచించారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, గ్రామాల వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినా.. సమస్యలు పరిష్కరించకపోవటం సిగ్గుచేటు అన్నారు. పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాకేష్, ఇఫ్టూ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, షకీలా, వంశీ, నాగచారి పాల్గొన్నారు.

తపాలాశాఖ హర్ ఘర్ తిరంగా ర్యాలీ



మంత్రి పువ్వాడకు జాతీయ జెండాను అందజేస్తున్న తపాలా శాఖ సిబ్బంది

ఖమ్మంవైరారోడ్: నగరంలో తపాలా శాఖ ఆధ్వర్యాన గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. తపాలా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత మున్సిపల్ కార్యాలయం మీదుగా వైరా రోడ్, రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ మేరకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీపీ గౌతమ్, ఇతర అధికారులకు జాతీయ జెండాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వై.కోటేశ్వర్, పోస్ట్ మాస్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పబ్లిక్ రిలేషన్ అధికారి పమ్మి వెంకటేశ్వరరావు, గాంధీచౌక్, కలెక్టరేట్, ప్రధాన తపాలా కార్యాలయం సిబ్బంది, పోస్టల్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా న్యాయవాదుల ఆటల పోటీలు

ఖమ్మంలీగల్: పంద్రాగస్టు సందర్భంగా ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరుగుతున్న ఆటల పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం పాటలు, క్యారమ్స్, చదరంగం పోటీలు నిర్వహించారు. ఈసీ సభ్యులు వల్లాల అరుణ, పోరిక ఇందిర పర్యవేక్షణలో పాటల పోటీలు నిర్వహించగా.. సోలో సాంగ్‌లో వి.సురేష్(ప్రథమ), వి.లక్ష్మీభార్గవి(ద్వితీయ), ఈ.ధనలక్ష్మి, డి.కల్యాణి (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. గ్రూప్ సాంగ్‌లో వి.సురేష్ బృందం(ప్రథమ), ఎస్.రమాదేవి బృందం(ద్వితీయ), కే. నాగేశ్వరరావు బృందం (తృతీయ) బహుమతులు కైవసం చేసుకున్నారు. న్యాయనిర్ణేతలుగా కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, పసుమర్తి లలిత, ఈ.రామలక్ష్మి వ్యవహరించారు.

కొత్త కోర్సు మంజూరు

ఖమ్మం సహకారనగర్: తమ కళాశాలకు బీఎస్సీ ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ అనే కొత్త కోర్సు మంజూరైనట్లు ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, తత్సమాన పూర్తయిన వారు అర్హులన్నారు. ఈ నెల 13వ తేదీన దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం మూడు కళాశాలల్లో ఈ కోర్సు మంజూరు అయినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని జీడీఎస్‌ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న గ్రామీణ డాక్ సేవకులు

ఖమ్మంగాంధీచౌక్: ఆలిండియా పోస్టల్ జేఏసీ పిలుపులో భాగంగా గురువారం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట గురువారం గ్రామీణ డాక్ సేవక్‌లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీడీఎస్ జేఏసీ చైర్మన్ సీహెచ్.కోటేశ్వరరావు, కన్వీనర్ బి.జయరాజు మాట్లాడుతూ.. జీడీఎస్‌లకు సీనియారిటీ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, రూ.5లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని కల్పించి, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా జేఏసీ చైర్మన్ రాంప్రసాద్, కన్వీనర్ మౌలాలి, మత్తె వెంకటేశ్వరరావు, శ్రీరాములు, వి.శ్రీనివాసరావు, పట్టాభి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో 'హార్వెస్ట్' విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: చార్టెడ్ అకౌంట్(సీఏ) అర్హత పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థిని నైనా బహేటి తొలి ప్రయత్నంలోనే సీఏ ఫౌండేషన్‌కు అర్హత సాధించినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. గురువారం విద్యార్థినిని అభినందించాక వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

'హార్వెస్ట్ టెండర్ రూట్స్'లో రెడ్ డే వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని హార్వెస్ట్ టెండర్ రూట్స్ పాఠశాలలో రెడ్ డే వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగుల ప్రాధాన్యతను తెలుపుతూ ఎరుపు రంగు ఉత్సాహం, శక్తి నిస్తుందని పేర్కొన్నారు.టెండర్స్ హెచ్ఎం అసిమ, అకాడమిక్ ఇన్‌చార్జ్ ఉషశ్రీ పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చరణ్‌రెడ్డి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాంరెడ్డి చరణ్‌రెడ్డి గురువారం నిత్యావసరాలు అందజేశారు. ఇటీవల వచ్చిన వరదలతో ఇబ్బందులు పడిన దృష్ట్యా 30 మంది మత్స్యకారులకు ఈ సాయాన్ని అందజేశారు. అనంతరం చరణ్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపరిచి అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గొల్లపూడి వీరన్న, భీష్మాచారి, ఉపేందర్, గోపి, సైదులు, కోటేష్, ఎరబోలు శ్రీనివాసరావు, దాసరి వెంకన్న, బెల్లంకొండ కిరణ్, హరినాథ్, సంకీర్త రెడ్డి, రమేష్, సురేష్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: జమాతె ఇస్లామిహింద్ ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ అధ్యక్షురాళ్లుగా ఆసియా అంజుమ్, హుస్సైన్‌బీ, ఖాసిమా షాహిన్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలిద్ ముబష్షిర్ జాఫర్ ఉత్తర్వులు జారీచేశారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలువురు వారిని అభినందించారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సైదాబాను, సభ్యులు సీమ అతహర్, షాహెదాసుల్తానా, అఫ్రోజ్, నస్రీన్, హాజిరా, పర్జానా, షాజియా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



కూసుమంచి: ధర్మాతండాలో ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశాక విద్యార్థులతో విజయమ్మ

కూసుమంచి/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు కందాళ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్లేట్లు, గ్లాసులను గురువారం పంపిణీ చేశారు. కూసుమంచిలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ పంపిణీ చేశాక పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాలల్లో ఎమ్మెల్యే కుమార్తె దీప్తి ప్లేట్స్, గ్లాసులు పంపిణీ చేయడంతో పాటు ఇటీవల మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్యతో పాటు శాంత, నెల్లూరి లీలాప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ బంధు ప్రకటించాలి

నేలకొండపల్లి: భూమిలేని నిరుపేదలకు కూలీ బంధు ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా కూలీ పెంచడంతో పాటు కూలీ బంధు ప్రకటించి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, లక్ష్మి, వెంకటేశ్వర్లు, పెరుమాళ్లు, మల్లేశ్వరరావు, మల్లిఖార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: యూటీఎఫ్ ఏర్పడి యాభై ఏళ్లు నిండిన సందర్భంగా గురువారం జిల్లాలోని అన్ని మండలాల్లో స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని యూటీఎఫ్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం తమ సంఘం పని చేస్తుందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పీఆర్సీ ప్రకటించి, మధ్యంతర భృతి విడుదల చేయాలన్నారు.

ఫైలేరియా నివారణకు సహకరించాలి



కేజీబీవీలో మందు వేస్తున్న ఎంపీపీ మంగీలాల్

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: ఫైలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్ సూచించారు. గురువారం నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంపీడీఓ, తిరుమలాయపాలెం కస్తూర్బా పాఠశాలలో ఎంపీపీ, రూరల్ మండలం గూడురుపాడు పీహెచ్‌సీలో జెడ్పీటీసీ బోదకాలు నివారణ మందులు పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. రెండేళ్లు పైబడిన వారు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యులు కె.రాజేష్, ఆర్.శ్రావణ్‌కుమార్, రామారావు, శ్రీదేవి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీఓ సునీత, హెచ్ఈఓలు వీరన్న, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.